క్లుప్తంగా

మేరిగకు చిత్రపటం బహూకరణ

గూడూరురూరల్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎంపికై తొలిసారిగా గూడూరుకు విచ్చేసిన మేరిగ మురళీధర్‌కు నాయకులు ఆయన చిత్రపటాన్ని బహూకరించారు. ఆదివారం గూడూరులో జరిగిన విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి కె ఎం పూర్ణచంద్ర, గూడూరు పట్టణ కార్యదర్శి కాంధ్ర నారాయణరెడ్డి, వేణుంబాక మహీధర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ మేరిగకు ఆయన చిత్రపటాన్ని బహూకరించి అభినందనలు తెలియజేశారు.

సద్వినియోగం చేసుకోండి

పెళ్లకూరు: మండలంలోని పాలచ్చూరు, చెంబేడు గ్రామాల్లో ఈనెల 20, 21తేదీల్లో ఆయా గ్రామాల సచివాలయాల్లో ఆధార్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సురేష్‌బాబు సూచించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్‌నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఆధార్‌కు మొబైల్, మెయిల్ ఐడీ లింక్ చేయడం, బయోమెట్రిక్, పేరు, అడ్రస్, పుట్టిన తేదీ సవరణలు చేసుకునే అవకాశం కూడా ఉందన్నారు. అలాగే కొత్తగా ఆధార్ నమోదుతో పాటు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అవసరమైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

నాయుడుపేటటౌన్: అయ్యప్పరెడ్డి పాళెం జాతీయ రహదారి పక్కనే ఉన్న భగవతి మల్లికాంబ ఆలయం వద్ద ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. చెన్నై శంకర నేత్రాలయం వైద్యులు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 35 మందికి శుక్లాలకు సంబంధించి సమస్య ఉన్నట్లు గుర్తించి వీరికి ఉచితంగా శస్త్రచికిత్స చేసేందుకు ఎంపిక చేశారు. ఆదివారం మొదటి 18 మందిని చెన్నై వైద్యశాలకు తీసుకెళ్లినట్లు నిర్వాహకులు గూడూరు సుధీర్‌రెడ్డి, అమాస మల్లికార్జున తెలిపారు.

నేడు మున్సిపల్ కార్యాలయంలో స్పందన

వెంకటగిరి: ఎన్నికల కోడ్ కారణంగా నాలుగు వారాలుగా స్పందన కార్యక్రమాన్ని అధికారులు రద్దు చేశారు. అయితే ఎన్నికలు ముగిసి కోడ్ తొలగడంతో మళ్లీ సోమవారం నుంచి స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బీవీ రామయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గాయపడిన వ్యక్తి మృతి



హరిప్రసాద్(ఫైల్)

పెళ్లకూరు: చిల్లకూరు గ్రామం వద్ద గత నెల 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి నెల్లూరు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన హరిప్రసాద్ కుటుంబసభ్యులతో కలిసి తిరుమలకు కారులో వెళుతుండగా చిల్లకూరు వద్ద డివైడర్‌ను ఢీకొన్న విషయం తెలిసిందే. ఈఘటనలో డివైడర్‌కు ఏర్పాటు చేసివున్న సరుగుడు కొయ్య హరిప్రసాద్ కడుపులోకి చొచ్చుకెళ్లి వీపు నుంచి వెలుపలికి రావడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ అతన్ని నెల్లూరు అపోలో ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య సులోచన, కుమార్తె లోలిత, కుమారుడు రోహిత్ ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

వైభవంగా మహాకుంభాభిషేకం



మహాకుంభాభిషేక వేడుకల్లో భక్తులు

కోట: మండల పరిధిలోని చిట్టేడు గ్రామంలో వెలసిన సీతా సమేత కోదండరామస్వామి దేవస్థానం నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక ఉత్సవాలు మూడు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. చివరి రోజు ఆదివారం మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, విశేషారాధన, సీతారాముల కల్యాణం, గ్రామోత్సవం కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

24న బైక్ వేలం

వెంకటగిరి: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో ఈనెల 24న బైక్ బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు సెబ్ సీఐ నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ కమిషనర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఉత్తర్వుల మేరకు దాడుల్లో పట్టుబడిన సుజికి స్కూటీని 24న ఉదయం 10గంటలకు బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వేలంపాటలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటా

- ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్
- జనసందోహంతో భారీ ర్యాలీ



ప్రజలకు అభివాదం చేస్తూ భారీ ర్యాలీలో పాల్గొన్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, మేరిగ మురళీధర్

గూడూరు: బడుగు, బలహీన వర్గాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందున్నారని, దీంతో మధ్యతరగతి కుటుంబీకుడైన తనను స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారని ఈ మేరకు ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటానని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికై తొలిసారిగా ఆదివారం గూడూరుకు విచ్చేసిన మేరిగ మురళీధర్‌కు పార్టీ శ్రేణులు భారీ ఎత్తున స్వాగతం పలికారు.టవర్ క్లాక్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించి అక్కడి నుంచి భారీ ర్యాలీగా వచ్చి స్థానిక సీఆర్ రెడ్డి కల్యాణమండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మేరిగ మాట్లాడుతూ ముందుగా నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పార్టీలో తనకు పెద్ద బాధ్యతను అప్పగించారన్నారు. అనంతరం గూడూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారన్నారు. అనంతరం గడప గడపకు కార్యక్రమంలో ప్రతి కుటుంబాన్ని కలుసుకునేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనకు అవకాశం కల్పించారని చెప్పారు. ఈ క్రమంలోనే తనపై నమ్మకంతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికకు దారితీసిందన్నారు. క్రమశిక్షణతో వ్యవహరించడంతోనే పార్టీ కార్యాలయం నుంచి నేరుగా పిలిచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికల బీఫారం అందించారని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. స్థానిక సంస్థలు సంబంధించి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ తనను గుర్తించి ఉన్నతస్థాయికి చేర్చిన గూడూరు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞుడినై అందుబాటులో ఉంటానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్త పనిచేసేలా కృషిచేస్తానని తెలిపారు. అనంతరం ఆయన్ను గజమాలలతో సన్మానించారు. అలాగే నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షుడు తాళ్లూరు శ్రీనివాసులు యాలకల మాలతో మేరిగను ఘనంగా సత్కరించారు. పార్టీ పట్టణ, రూరల్, కోట, చిట్టమూరు మండలాల అధ్యక్షుడు బి. శ్రీనివాసులు, మల్లు విజయ్‌కుమార్ రెడ్డి, పరంధామిరెడ్డి, సంపత్‌కుమార్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, నాశిన నాగులు, ఎంపీపీ గురవయ్య, అట్ల శ్రీనివాసులరెడ్డి, ఎం సతీష్ రెడ్డి, కట్టా రామచంద్రారెడ్డి, బాబురెడ్డి, సునీల్‌రెడ్డి, మగ్దూం, గఫూర్, బట్టా గోపీయాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, చిత్రంలో నేదురుమల్లి



మేరిగను గజమాలతో సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

పేద విద్యార్థులకు చేయూతనిస్తాం



విద్యా సామగ్రిని అందజేస్తున్న జిందాల్ ప్రతినిధులు

చిల్లకూరు: విద్యకు ప్రాధాన్యత ఇస్తూ పరిశ్రమ సీఎస్ఆర్ నిధుల ద్వారా పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సహకారం అందిస్తామని తమ్మినపట్నంలోని జిందాల్ సింహపురి ఎనర్జీ లిమిటెడ్ ప్రతినిధులు తెలిపారు. చిల్లకూరులోని డేనియల్ చిల్డ్రన్ హోంలో వసతి పొందుతున్న 50 మంది విద్యార్థులకు ఆదివారం పరిశ్రమ ప్రతినిధులు విద్యాసామగ్రిని అందించి ఒక్క పూట భోజన వసతి కల్పించారు. అనంతరం త్వరలో పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు సుల్తాన్ అహ్మద్ మన్సూరీ, దిలీప్‌కుమార్ పాలిక్, బోబిన్ మాథ్యు, శివాజీ, బాలచెన్నయ్య, హోంవార్డన్ శాంతారామ్ పాల్గొన్నారు.

22 నుంచి ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు

దొరవారిసత్రం: విద్యాహక్కు చట్టప్రకారం 2023–24 విద్యసంవత్సరానికిగాను పేద విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా ప్రవేశానికి ఈనెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని డీవీ సత్రం ఎంఈఓ మస్తానయ్య తెలిపారు. ఏప్రిల్ 13నుంచి 17వ తేదీ వరకు అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసి 18న మొదటి జాబితాను విడుదల చేస్తారన్నారు. ఏప్రిల్ 19నుంచి 25వ తేదీ లోపు ఎంపికైన విద్యార్థులు ఆయా పాఠశాలల్లో చేరాల్సి ఉంటుందని తెలిపారు. 29న రెండవ జాబితాలో విడుదల చేసిన విద్యార్థులు మే1న నిర్ణయిత పాఠశాలలో ప్రవేశం కల్పిస్తారని చెప్పారు.

అర్చకులకు ఉగాది సత్కారాలు



అర్చక దంపతులను సత్కరిస్తున్న జనార్దన్‌రెడ్డి, రోహిణి

గూడూరు: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని, అర్చక దంపతులకు ఘనంగా ఆత్మీయ సత్కారాలు చేయడం ఎంతో అభినందనీయమని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి, ప్రముఖ వైద్యులు జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వీరభద్ర స్వామి ఆలయంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పలు సేవా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సంస్థ అధ్యక్షుడు కే చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు బి.ధనుంజయరెడ్డి, సుబ్రమణ్యం, కే శ్రీనివాసులు, సురేంద్రనాథ్‌రెడ్డి, వి.రామ్మోహన్‌రావు, కరీముల్లా, ప్రజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండండి

వెంకటగిరి: వెంకటగిరి ప్రాంతంలో మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని వెంకటగిరి ట్రాన్స్‌కో డీఈఈ మునిరవిచంద్ర తెలిపారు. స్థానిక ఆయన కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రైతులు చిన్నపాటి వర్షాలు కురిసే సమయంలో బోర్ల వద్ద విద్యుత్ స్టాటర్‌లు, స్విచ్‌బోర్డులు, విద్యుత్ తీగలను తాకరాదన్నారు. పొలాలు, జనావాస ప్రాంతాల్లో వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్‌స్తంభాలు, విద్యుత్‌తీగల కిందకు వెళ్లడం ప్రమాదకరమని చెప్పారు. విద్యుత్ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఫలసరుకుల పంపిణీ



ఫల సరుకులు అందజేస్తున్న దామోదర్‌రెడ్డి

వాకాడు: వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలోని పట్టాభిరామాలయంలో ఆదివారం సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో పురోహితులకు ఫల సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. ప్రవాస భారతీయులు వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ కుటుంబసభ్యుల దాతృత్వంతో అందజేసిన రూ. 1.50 లక్ష విలువ చేసే ఫలసరుకులు, కూరగాయలను వైఎస్సార్‌సీపీ నేత కొడవలూరు దామోదర్‌రెడ్డి చేతుల మీదుగా 150 మంది పేద పురోహితులు, అర్చకులకు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు దీవి అనంతాచార్యులు, కిరణ్‌రెడ్డి, లావణ్య, శ్రీరామసేన సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న విహంగాల విన్యాసాలు



నత్తగుల్లకొంగ పిల్లలు



విహంగాలను ఆశక్తిగా తిలికిస్తున్న పక్షి ప్రేమికులు



గూడబాతు పిల్ల

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో వలస విహంగాల పక్షి పిల్లల విన్యాసాలు, కేరింతలు పక్షి ప్రేమికులను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం వర్షం కురుస్తున్నా పలు ప్రాంతాల నుంచి సందర్శకుల పక్షుల కేంద్రాన్నికి విచ్చేసి విహంగాలను తిలకించారు. గూడబాతులు, నత్తగుల్లకొంగలు, తెడ్డుముక్కుకొంగలు, తెల్లకంకణాయిలు వందల సంఖ్యలో పిల్లలను పొదిగాయి. అదేవిధంగా నీటికాకులు, స్వాతికొంగలు, శబరికొంగలు, బాతు జాతికి చెందిన పలు రకాల పక్షులు కూడా కేంద్రంలోని కడప చెట్లపై పిల్లలను పొదిగాయి. పిల్లలు అన్ని పూర్తి స్థాయిలో ఎగిరే సమయానికి విహంగాల సీజన్ పూర్తవుతుంది. ఏప్రిల్‌లో పక్షుల కేంద్రంలోని విహంగాలు అన్ని ఆయా దేశాలకు వెనుదిరిగి వెళ్లిపోతాయని స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉత్తమ సైన్స్ ప్రదర్శన



విద్యార్థి చేసిన ప్రదర్శనతో హెచ్‌ఎం

ఓజిలి: చిలమానుచేను ఉన్నత పాఠశాలకు చెందిన పార్థు రీత్విక్ ప్రదర్శించిన సైన్స్ ప్రదర్శన రాష్ట్రస్థాయి ప్రదర్శనలకు ఎంపికైందని హెచ్‌ఎం అనసూయ శనివారం తెలిపారు. ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమంలో 2021–22 సంవత్సరానికి గాను ఈ ఏడాది ఫిబ్రవరి 9,10 తేదీల్లో నెల్లూరు జిల్లా స్థాయిలో ఆన్‌లైన్‌ద్వారా జరిగిన జాతీయసైన్స్ ప్రదర్శనలలో చిలమానుచేను పాఠశాలకు చెందిన తొమ్మిద తరగతి చదువుతున్న విద్యార్థి ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శన ఉత్తమ ప్రతిభ కనబరిచింది. దీంతో ఈ ప్రదర్శన రాష్ట్రస్థాయి ప్రదర్శనలకు ఎంపిక చేశారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థిని ప్రోత్సహించిన సైన్స్ ఉపాధ్యాయులు జమ్ముల శ్రీనివాసులు, చల్లా ప్రసాద్‌లను పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో హెచ్‌ఎం అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

శ్మశాన దారికి ప్రణాళికలు సిద్ధం



శ్మశాన వాటికకు వెళ్లే దారిని పరిశీలిస్తున్న ఎంపీటీసీ

చిల్లకూరు: దళితుల శ్మశాన వాటికకు వెళ్లే దారి పూర్తిగా మూసుకుపోవడంతో దారి ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని ఆదివారం చింతవరం ఎంపీటీసీ పాలూరు మాధవి తెలిపారు. చింతవరం దళితవాడకు చెందిన శ్మశాన వాటికకు వెళ్లే మార్గం పూర్తిగా ముళ్లపొదలతో నిండుకుపోయి, రోడ్డు కూడా సక్రమంగా లేదన్న విషయాన్ని స్థానికులు ఎంపీటీసీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె స్థానికులతో కలిసి శ్మశాన వాటికకు వెళ్లే దారిని పరిశీలించిన అనంతరం మండల అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లింది. దీంతో ఎంపీడీఓ విష్ణు చిరంజీవి దారికి అవసరమైన ఎస్టిమేషన్లు వేయించేలా చూడాలని సూచించడంతో ఆమె దారి మరమ్మతులకు ఎంత మేర నిధులు అవసరమౌవుతాయోనని కొలతలు వేయించారు. ఆమె మాట్లాడుతూ మరో నెలలోగా శ్మశాన దారికి మోక్షం కలిగేలా చూస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు.

బీజేపీ మాదిగలను మోసం చేస్తోంది



సంగ్రామ యాత్రలో ఎంఆర్‌పీఎస్ నేతలు

కలువాయి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాదిగలను మోసం చేస్తోందని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు విమర్శించారు. రెండో విడత మాదిగల సంగ్రామ యాత్రలో భాగంగా ఆదివారం కలువాయిలో వారు పర్యటించారు. ఈసందర్భంగా బస్టాండు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు మందపెంచలయ్య మాదిగ, ఎంఎస్‌పీ నెల్లూరు జిల్లా ఇన్‌చార్జ్ గొల్లపల్లి శ్రీనివాసులు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా తమ ఉద్యమం 29 సంవత్సరాలుగా సాగుతోందన్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 4న హైదరాబాద్, విజయవాడ ముట్టడి కార్యక్రమానికి మాదిగలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ పట్ల బీజేపీ అనుసరిస్తున్న వైఖరిని ఎండగడుతూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు ఈ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా కో కన్వీనర్ కోలగట్ల రమేష్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ నాయకులు సిసింద్రీ మాదిగ, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షులు విజయలక్ష్మి మాదిగ, నేతలు జి.అనంతయ్య, డి.భార్గవ్, సీహెచ్ నరసయ్య పాల్గొన్నారు.

అకాల వర్షం..అపార నష్టం

- నీట మునిగిన మిరప, వరి
- ఉపరితల ఆవర్తన ప్రభావం
- ఈదురుగాలుల బీభత్సం
- దెబ్బతిన్న రహదారులు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం



పాలకొండసత్రంలో నేలకొరిగిన వరి పైరు



కొట్టుకుపోయిన మిరపకాయలను శుద్ధిచేస్తున్న కూలీలు



కలపాడు వద్ద తడిసిన ధాన్యాన్ని ఆరపెడుతున్న రైతులు



రాపూరులో దెబ్బతిన్న వరిపంట

వెంకటగిరిరూరల్: బంగాళఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా కురుస్తున్న అకాల వర్షానికి రైతన్నలు విలవిలలాడిపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట ప్రస్తుతం కోతదశలో ఉండగా కొన్నిరోజుల నుంచి నియోజకవర్గ పరిధిలో కురుస్తున్న వర్షాలకు సాగులో ఉన్న వరిపంట నేలకొరిగిపోవడం, పంటపొలాల్లో నీరు చేరడం, ధాన్యం రాలిపోవడం వంటివి జరుగుతున్నాయి. దీంతో సాగుచేసిన పంటలో తమకు నష్టం వాటిళ్లుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లో రబీ సీజన్‌లో 8వేల హెక్టార్లల్లో రైతులు వరి పంటను సాగుచేశారు. ఇందులో ముందుగా సాగుచేసిన రైతులు 10వేల ఎకరాల్లో కోత పనులు జరగగా మిగిలిన భూముల్లో పంటలు కోతదశ ఉన్నాయి. విస్తారంగా వర్షాలు పడడంతో కోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు పొలాల సమీపంలోనే రైతులు పట్టల సహాయంతో పంటను కాపాడుకుంటున్నారు.

సైదాపురం: వరుణుడు ప్రకోపించడంతో అకాల వర్షం, ఈదురుగాలుల బీభత్సంతో చేతికొచ్చిన పంట నీటిపాలైంది. వర్షానికి వరిపంట వాలిపోయింది. కల్లాలలో ఆరబోసిన మిరప గంగపాలైంది. శనివారం రాత్రి ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలులకు విద్యుత్ సరఫరాకు పూర్తిగా అంతరాయం కలిగింది. ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. మండలంలోని జోగిపల్లి, సైదాపురం, కమ్మవారిపల్లి, కలిచేడు, అనంతమడుగు, తలుపూరు, గిద్దలూరు గ్రామాల్లో 500 ఎకరాల్లో సాగు చేసిన వరిపంట నేలవాలగా పలు గ్రామాల్లో పత్తిపంటకు కూడా నష్టం వాటిల్లింది. జోగిపల్లికి చెందిన పందిటి కృష్ణమ్మ, పందిటి సురేష్‌బాబు గ్రామంలోనే ఓ భూస్వామికి చెందిన 7ఎకరాల మాగాణి భూమిని కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో కురిసిన అకాల వర్షానికి పూర్తిగా పంట నేలవాలింది. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. అలాగే శంకరయ్య అనే రైతు సైదాపురంలో 5ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని మిరప పంటను సాగు చేస్తున్నారు. గత రెండు రోజులుగా మిరపకాయలను కల్లాలలో 12టన్నులు ఆరబోసిన కాయలు ఈదురుగాలులకు పూర్తిగా కొట్టుకుని పోయాయి. అలాగే మండలంలో 50 ఎకరాల్లో కోసి కల్లాలలో ఆరబోసిన మిరప పంట దెబ్బతింది. మామిడి, నిమ్మ రైతులకు మాత్రం కొంత ఊరట లభించింది. సైదాపురం–పొదలకూరు రోడ్డు మరింత దారుణంగా దెబ్బతింది.

రాపూరులో...

రాపూరు: మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కోతకు వచ్చిన వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలో 120 ఎకరాల్లోని వరి పంట దెబ్బతిన్నట్లు ఏఓ సోమసుందర్ తెలిపారు. పంటల్లోకి నీరు చేరడంతో పంట నేలపాలైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలీవాన తీవ్రంగా రావడంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

పంటనష్టం నివేదికలను సిద్ధం చేస్తున్నాం

నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో 20 వేల హెక్టార్లల్లో రైతులు పంటలు సాగుచేసుకోగా 10 హెక్టార్ల వరకు కోత పనులు పూర్తయ్యాయి. కొన్నిరోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఇప్పటి వరకు 1300 ఎకరాల పంట నష్టం జరిగి ఉండవచ్చునని అంచనాలు సిద్ధం చేశాం. పంటనష్టం జరిగిన రైతులకు వివరాలు నమోదుచేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నీరు నిల్వ ఉన్న వరి పంటల్లో మొలకలు ఎత్తకుండా ఉప్పునీరు పిచికారీ చేయాలి, అదేవిధంగా పొలాల్లో నీరు నిల్వలేకుండా రైతులు చర్యలు తీసుకోవాలి. – నాగార్జునసాగర్, వ్యవసాయశాఖ ఏడీ, వెంకటగిరి